పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



చిన్నారికి అన్నప్రాసన చేయిస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: పౌష్టికాహారంతోనే తల్లి,బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని బుర్జుగడ్డతండా అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికంగా లభించే తాజా కూరగాయలు, పండ్లను రోజువారి ఆహారంలో తీసుకుంటే శరీరానికి మంచి పోషకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, నాగలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, మహిళలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి చేయూత



విద్యార్థి ఫీజు చెల్లించిన రెడ్డి ఫౌండేషన్ నాయకులు

మణికొండ: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాల ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విద్యార్థికి మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న బాలనాగయ్య కుమారుడు సంతోష్ స్థానిక ఎస్ఆర్ డీజీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యాసంవత్సరం ఫీజు చెల్లించక పోవటంలో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన వారు పాఠశాలకు వెళ్లి రూ. 25వేలు చెల్లించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు శ్రీపతిరెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ రెడ్డి ఫౌండేషన్ తరపున కేవలం రెడ్డిలకు మాత్రమే కాకుండా అవసరం ఉన్న వారికి సహాయ సహకారాలు అందిస్తామనన్నారు. తమ కుమారుడి విద్యను కొనసాగించేందుకు సహకరించిన రెడ్డి ఫౌండేషన్‌కు తండ్రి బాలనాగయ్య, తల్లి శాంతమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ..



నరసింహ యాదవ్, బాల్‌రాజ్‌లను పరామర్శిస్తున్న రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, ప్రేమావతిపేట్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మజ్జిగ నరసింహ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోరని బాల్‌రాజ్ అనారోగ్యానికి గురైనట్లు సమాచారం అందడంతో బుధవారం రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జలపల్లి నరేందర్ తదితరులు వారిని కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డివిజన్ అధ్యక్షులు ఎస్.ధనుంజయ, సీనియర్ నాయకులు మజ్జిగ విజయ్ కుమార్, గోల్కొండ రాజ్ కుమార్, రవీందర్, శ్రీశైలం, రాజిరెడ్డి, అశోక్, మహేశ్ తదితరులు ఉన్నారు.

దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు



కిస్మత్‌పూర్ పోచమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని దేవాలయాలపై దాడుల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని ముఖ్య దేవాలయాలతో పాటు బస్తీలు, కాలనీల్లో చిన్న దేవాలయాల వివరాలను సేకరించారు. దేవాలయ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు లేని దేవాలయాల వద్ద స్థానికుల సహకారంతో కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నారు. స్టేషన్ పరిధిలోని అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టేందుకు చర్యలు ప్రారంభించారు. మరో వారం రోజుల్లో అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు అప్పారెడ్డి ముఖేష్

అత్తాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. బుధవారం ఆయన రోడ్ల ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా అత్తాపూర్ డివిజన్ పరిధిలోని రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దీంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి రెండు రోజుల క్రితం సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌ను కలిసి వివరించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగానే బుధవారం రహదారులకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- పండుగకు అలంకరణ కొనుగోళ్లు
- బేగంబజార్, సిద్ధిఅంబర్‌బజార్, ఛత్రి మార్కెట్లలో సందడి

మార్కెట్లకు దీపావళి శోభ



విద్యుత్ జూమర్లు



విద్యుత్ జ్యోతులు

అబిడ్స్/జియాగూడ: దీపావళిని పురస్కరించుకొని గృహ అలంకరణ, వ్యాపార సముదాయాలకు కావాల్సిన వస్తువుల కోసం వచ్చిన కొనుగోలు దారులతో బేగంబజార్ మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. పండుగలకు సంబంధించిన వస్తువులు తక్కువ ధరలకే లభిస్తుండడంతో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌లకు కొనుగోళ్ల తాకిడి అధికంగా ఉంటుంది. దీపావళికి ప్రత్యేక ఆకర్షణ మిరుమిట్లు గొలిపే దీపకాంతులు, విద్యుత్, మట్టి, ప్లాస్టిక్, శిరమిక్ దీపాలు వివిధ సైజు, అంకరణ, రంగులలో లభిస్తున్నాయి. అలాగే జూమర్లు, అగర్‌బత్తులు, పూజా పీటలు, పూజా సామగ్రి, వన్ గ్రామ్ గోల్డ్ అర్నమెంట్స్, దొంతులు, బొమ్మల కొలువు బొమ్మలు, క్యాండీల్స్, తదితరవి ఎన్నో లభిస్తున్నాయి.

29 నుంచి దీపావళి వేడుకలు ప్రారంభం..

ఈనెల 29న దంతెరాస్ పూజ, 30న శ్రీ కాళి చౌదశ, 31న శ్రీ నరక చతుర్దశి, దీపావళి పర్వదినం, 2న శ్రీ గోవర్ధన పూజ, 3న భాయ్‌దుజ్ వేడుకలతో పూర్తి అవుతాయి. దీంతో వేడుకలకు కావాల్సిన వస్తువులు కొనుగోళ్ల కోసం ఉత్తర భారతీయులు, హోల్‌సేల్, రిటైల్ విక్రయదారులతో పాటు పలు ప్రాంతాల నుంచి పండుగకు కావాల్సిన వస్తువులు కొనేందుకు చేరుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

భర్తన్ బజార్‌లో కొనుగోలుదారుల సందడి





గృహ అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



కిటకిటలాడుతున్న బేగంబజార్ మార్కెట్

మూసీ బాధితులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

బండ్లగూడ: మూసీ బాధితులకు బీజేపీ అండగా ఉంటూ వారి పక్షాన పోరాడుతుందని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్, బైరాగిగూడ, గంధంగూడ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం విఘ్నేశ్వర కాలనీ, శివపురి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, మారుతీనగర్, కార్వెల్ హోమ్స్, డ్రీమ్ హోమ్స్, కేంద్ర విహార్, విశాల్‌నగర్, సాయిహర్ష కాలనీ, సాయిరామ్‌నగర్, మధుపార్క్, రిచ్‌మండ్ విల్లాస్ ప్రాంతాలకు చెందిన వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ బాధితులకు న్యాయం జరిగేంతవరకూ భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పైసా పైసా కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుంటే ప్రభుత్వం వాటిని కూల్చేందుకు కుట్ర పన్నుతుందన్నారు. సదరు నివాసాలకు అధికారులు, ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందన్నారు. అసలు మూసీకి సంబంధించి ప్రభుత్వం వద్ద ప్రణాళిక సిద్ధంగా ఉందా అని ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చుతామంటే భారతీయ జనతా పార్టీ ఎట్టి పరిస్థితిల్లో ఒప్పుకోదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుగ్యాల ప్రదీప్, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు బొక్క నర్సింహ్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, కార్పొరేషన్ అధ్యక్షులు మహేష్ యాదవ్, మహాలింగంగౌడ్, భీమార్జున్‌రెడ్డి, వేణురెడ్డి, రవి, రఘు, ప్రశాంత్, నరేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేశారు. కాటేదాన్ టీఎన్‌జీఓఎస్ కాలనీ సర్వే నంబర్ 156/1లో ప్రభుత్వ స్థలంలో ఇద్దరు వ్యక్తులు రెండు నిర్మాణాలను చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రాములు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన అధికారులు సదరు స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. బుధవారం పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా కూల్చివేతలను అడ్డుకున్న కబ్జాదారులు జేసీబీపై రాళ్లతో దాడి చేయడంతో జేసీబీ అద్దాలు ధ్వంసమయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తాము రూ, లక్షలు వెచ్చించి స్థలాన్ని కొనుగోలు చేశామని... ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం అన్యాయమంటూ వాపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామన్నారు. సర్వే నంబర్ 156/1లో నిర్మాణాలు చేపట్టిన స్థలం ప్రభుత్వ స్థలమన్నారు. మరోసారి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిచారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మి(ఫైల్)

మణికొండ: భర్తతో గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ హిమగిరి నగర్ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, హైదర్‌షాకోట్ సెక్టార్ ఎస్సై ప్రభాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లాకు చెందిన వెంకటేష్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ భార్య లక్ష్మి(25), కుమారుడితో కలిసి హైదర్‌షాకోట్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం భార్యాభర్తల మధ్య మాటా, మాటా పెరిగి గొడవకు దారి తీసింది. వెంకటేష్ డ్యూటీకి వెళ్లగానే లక్ష్మి కుమారుడిని బయటికి పంపి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలుడు ఏడుస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు ఇంటికి వెళ్లి చూడగా లక్ష్మి ఉరికి వేలాడుతూ కనిపించింది. స్థానికుల సమాచారం తో సంఘటనా స్థలానికి చేరుకున్న నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, ఎస్సై ప్రభాకర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

గోల్కొండ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు

గోల్కొండ: ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాస రావు అన్నారు. బుధవారం ఆయన ఆసుపత్రి వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన ఆసుపత్రి ఆర్ఎంవో-1 సుధాకర్ తదితరులతో మరిన్ని మెరుగైన వైద్య సేవలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఫిజిషియన్, గైనకాలజిస్ట్ ఇతర వైద్య విభాగాలే కాకుండా దంత విభాగం, ఈఎన్‌టీ, డెర్మా తదితర విభాగాల వైద్య సేవలు కూడా అందుతున్నాయన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో-2 డాక్టర్ రమ్య, డాక్టర్ ప్రభావతి తదితరులున్నారు.

సమాజ సేవకు యువత ముందుకు రావాలి

గోల్కొండ: సమాజ సేవకు యువత ముందుకు రావాలని ఇంటర్నేషనల్ పీస్ అంబాసిడర్ డాక్టర్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వారు తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు పీస్ అంబాసిడర్‌గా ఎంపిక చేసిన సందర్భంగా బుధవారం ఆయనను మునావర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో చేసే సమాజ సేవ ద్వారా సమాజంలో గుర్తింపు పొందవచ్చునన్నారు.

ప్రభుత్వ భూమిలో పాగాకు యత్నం

- కొండలను చదును చేసేందుకు సన్నాహాలు
- పేలుడు పదార్థాలు స్వాధీనం
- బోర్డు తొలగింపుపై కేసు నమోదైనా తగ్గని అక్రమార్కులు



స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ భూమిలో కొండలను పగుల గొట్టి భూమిని చదును చేసేందుకు యత్నించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సర్వేనంబరు 626బై1లో హెచ్ఎండీఏకు చెందిన 5.15 ఎకరాల స్థలం తమదేనంటూ కొన్నేళ్ల క్రితం కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. స్థానికులు, కొందరు కౌన్సిలర్ల అభ్యర్థన మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 2021 డిసెంబర్ నుంచి 2022 మార్చి వరకు శంషాబాద్ రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సర్వేనంబర్ 626బై1లో హెచ్ఎండీఏకు కేటాయించిన 360 ఎకరాల స్థలంతో పాటు సదరు స్థలానికి పక్కనే ఉన్న బాలాజీ వెంచర్ సమీపంలోని స్థలంలోనూ 5.15 ఎకరాల భూమి ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్నట్లు గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. సదరు భూమిని స్వాధీనం చేసుకోవాలని హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులకు లేఖ రాశారు. దీంతో అప్పట్లో మున్సిపాలిటీ అధికారులు సంబధిత స్థలంలో అక్రమార్కుల నిర్మాణాలను తొలగించి బోర్డు ఏర్పాటు చ,ఏశారు. అయితే నాలుగైదు రోజులుగా 'కబ్జాదారులు స్థానిక ప్రజాప్రతినిధుల అండతో మరోసారి ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశించడంతో పాటు అక్కడ ఉన్న కొండలను చదును చేస్తుండడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐ పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అయినా వెనక్కి తగ్గని అక్రమార్కులు మరికొందరితో కలిసి సదరు స్థలంలోని బండరాళ్లను పేల్చేందుకు జిలెటిన్ స్టిక్స్ సైతం సిద్ధం చేశారు. దీనిపై సమాచారం అందడంతో రెవెన్యూ అధికారులు వారిని హెచ్చరించడంతో పాటు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే అక్రమంగా పేలుడు పదార్థాలు వినియోగిస్తున్న వారిపై ఎలాంటి కేసు నమోదు కాకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సర్కారు భూమిలో జరుగుతోన్న ఈ కబ్జా తతంగం ఎక్కడికి దారి తీస్తోందో..? దీని వెనక ఉన్న కీలక నేతలు ఎవరనేది శంషాబాద్ పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు మెమొరాండం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

బండ్లగూడ: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా ఉద్యమించాలని గండిపేట మండల సీఐటీయూ కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్టోబర్ 25న ఛలో హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మహాధర్నాకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్రకు బుధవారం మెమరాండం అందించారు. ఈ సందర్భంగా దప్పు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో, మున్సిపాలిటీల్లో సుమారు 65 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ ఫిక్స్‌డ్, పే డైలీ వేజ్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్నారన్నారు. సిబ్బంది పర్మనెంట్, కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు కావడం లేదన్నారు. పని చేస్తున్న సమయంలో ప్రమాదాల కారణంగా అనేక మంది మరణిస్తున్నా వారికి నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించాలన్నారు. మున్సిపల్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీల్లో కార్మికుల స్థానంలో రీప్లేస్‌మెంట్ చేయడంలో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని సవరణ చేసి సర్క్యులర్ జారీ చేయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, సుభాష్, సురేష్, నవీన్, శ్రీధర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాజేంద్రనగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ అన్నారు. పిల్లర్ నంబర్ 158 వద్ద సర్వీసు రోడ్డులో అక్రమ పార్కింగ్‌పై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అక్రమ పార్కింగ్‌ను తొలగించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై రాజేందర్, ఏఎస్సై రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

జోరు తగ్గిన వన మహోత్సవం

- లక్ష్యం చేరని మొక్కలు నాటే కార్యక్రమం
- స్థలాల కొరతతో ఇబ్బందులు



పాల్మాకులలో నాటిన మొక్కలు

శంషాబాద్ రూరల్: మండల పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం అమలు అంతంతమాత్రంగానే మారింది. వర్షాకాలం ముగియడంతో ఇప్పటి వరకు మండల పరిధిలో 78,700 మొక్కలు నాటారు. పంచాయతీకి ఆరు వేల మొక్కల చొప్పున లక్ష్యం నిర్ణయించగా.. స్థలాల కొరతతో వీటి సంఖ్య తగ్గింది.

రోడ్ల వెంబడి అంతంతే..

మండల పరిధిలోని 27 పంచాయతీల్లో ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్ల వెంబడి, రైతుల పొలాలు, చెరువు కట్టలపై పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. అందుబాటులో ఉన్న స్థలాల్లో సుమారు 79 వేల మొక్కలు నాటారు. అయితే వీటిలో రోడ్ల వెంబడి దాదాపు 7 వేల మొక్కలను మాత్రమే నాటారు. ఇందులో మూడు వరసలుగా మొక్కలు నాటడంతో సంఖ్య పెరిగింది. గత కొన్నేళ్లుగా చేపట్టిన హరితహారంలో సింహ భాగం మొక్కలను రోడ్లకు ఇరువైపులా నాటారు. దీంతో ప్రస్తుతం రోడ్లు వెంబడి స్థలం లేక తక్కువ మొత్తంలో మొక్కలు నాటాల్సి వచ్చింది. ప్రభుత్వ స్థలాలు, చెరువు కట్టలపై మిగతా మొక్కలను నాటారు. రైతుల పొలాల్లో చాలా తక్కువ మొక్కలు నాటగా.. అందులో డ్రాగన్ ఫ్రూట్, మునగ మొక్కలు ఎక్కువగా ఉన్నాయి. చిన్న గోల్కొండలో వెయ్యి మొక్కలు, పెద్దషాపూర్‌లో రెండు వేల మొక్కలను రైతుల పొలాల్లో నాటుకున్నారు.

మొదట్లో అనుకూలించని వాతావరణం..

వర్షాకాలం మొదట్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక.. వనమహోత్సవం కార్యక్రమానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. జూలై చివరి వరకు వర్షాలు అంతంతగానే ఉండడంతో నాటిన మొక్కలకు ట్యాంకర్లతో నీళ్లు పోయాల్సి వచ్చింది. తర్వాత విస్తారంగా వానలు కురవడంతో మొక్కలు నాటే కార్యక్రమం జోరందుకుంది. నాటిన మొక్కలకు సంబంధించి ఉపాధి కూలీ డబ్బులను చెల్లించే ప్రక్రియ వేగంగా సాగుతుంది. పిల్లోనిగూడలో ఒక్క మొక్క కూడా నాటలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

సంరక్షణకు చర్యలు తీసుకుంటాం



వీలైనంతగా ఎక్కువ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నాం. ఉపాధి కూలీల కొరత, స్థలాల కొరత కారణంగా అనుకున్న స్థాయిలో మొక్కలు నాటలేకపోయాం. నాటిన మొక్కలను సంరక్షించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– జి.మున్నీ, ఎంపీడీఓ, శంషాబాద్.